డిఇఒచే గుర్తింపు కార్డులు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి లంకలకోడేరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల యాజమాన్యం ద్వారా సరఫరా చేసిన గుర్తింపు కార్డులను విద్యార్థులకు అందజేశారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు సూచనలు, సూచనలు ఇచ్చారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం తరగతుల్లోని విద్యార్థుల ప్రగతిని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయ సిబ్బందితో సమావేశమై విద్యార్థుల ప్రగతి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యా బోధన చేసి సత్ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఇఒలు జి.వీరాస్వామి, ఆర్‌విఎస్‌జి.శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఫీజు కట్టండి.. పరీక్షలు రాయండి..!

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుపై కూటమి ప్రభుత్వం మౌనం వీడటం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు నరకం చూపిస్తున్నాయి. మొత్తం ఫీజులో సగం సొమ్ము చెల్లిస్తేనే మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయాలని, లేకపోతే కుదరదని యాజమాన్యాలు హుకుం జారీ చేశాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో పేద, మధ్యతరగతి విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై కూటమి సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విద్యార్థుల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది.

ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు హుకుం
ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం మౌనం
విద్యార్థులకు నరకం చూపిస్తున్న యాజమాన్యాలు
సగం ఫీజు కడితేనే మొదటి సెమిస్టర్ పరీక్షలకు అనుమతి
దిక్కుతోచని స్థితిలో పేద, మధ్యతరగతి విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఆయా కాలేజీల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత ప్రభుత్వం విద్యాదీవెన పేరుతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసింది. నాలుగు దఫాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును విద్యార్థులు, తల్లుల ఉమ్మడి ఖాతాల్లో జమ చేసేది. ఆ సొమ్మును విద్యార్థులు కాలేజీలకు చెల్లించేవారు. గత ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో కొన్ని ఇబ్బందులకు గురిచేయడంతో విద్యార్థుల్లో వైసిపి సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. దీంతో గడిచిన ఎన్నికల్లో చదువుకున్న యువత అంతా కూటమి సర్కార్‌వైపు మొగ్గారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి నాలుగు నెలలు దాటిపోయింది. ఇప్పటి వరకూ కూటమి సర్కార్ విద్యార్థుల గురించి ఏమాత్రం ఆలోచించని పరిస్థితి నెలకొంది. ఇంజినీరింగ్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు నవంబర్ మొదటివారంలో తొలి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు కాలేజీ యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నెల 19వ తేదీలోపు సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ.1,250 చెల్లించాలని అనేక కాలేజీల యాజమాన్యాలు నోటీసులు జారీ చేశాయి. విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు సిద్ధమవ్వగా, ట్యూషన్ ఫీజులో సగం సొమ్ము కడితేనే పరీక్ష ఫీజు చెల్లించే ఆన్‌లైన్ సైట్ ఓపెన్ అవుతుందని, వెంటనే ట్యూషన్ ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు హుకుం జారీచేశాయి. ఇంజినీరింగ్ కాలేజీల్లో వసతులను బట్టి ట్యూషన్ ఫీజు రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదు వేల వరకూ ఉంది. మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయాలంటే రూ.32 వేల నుంచి రూ.63 వేల వరకూ చెల్లిస్తేనే మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు వీలుంటుంది. రూ.లక్షా ఐదు వేల ఫీజు ఉంటే రూ.53 వేలు వరకూ చెల్లించాల్సి ఉంది. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కష్టపడి ఎపి ఈసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉందనే భరోసాతో మంచి కాలేజీల్లో చేరారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ రెండు, మూడు సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు.

పేద, మధ్యతరగతి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం

ఇంజినీరింగ్, డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రూ.30 వేలు, రూ.40 వేలు అప్పులు తెచ్చి ఫీజులు చెల్లించలేని నిస్సహాయ స్థితిలో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయకుండా వదిలేసేందుకు చాలా మంది విద్యార్థులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి నోరు విప్పడం లేదు. విద్యార్థుల సమస్యను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇప్పటి వరకూ విధివిధానాలు సైతం ప్రకటించలేదు. ఫీజు తాము చెల్లిస్తాం, విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దన్న ప్రకటనను సైతం ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వం మారినా తమ దుస్థితి మారలేదంటూ విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేయాలి. విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాలు ఒత్తిడి చేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో వేచిచూడాలి.

నివాసాల మధ్య మద్యం దుకాణాలొద్దు

రోడ్డెక్కిన గెద్దాడవారిపాలెం మహిళలు, రైతులు

వల్లూరులో మద్యం షాపు తొలగించాలంటూ ఎస్ఐతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి - ఆచంట

నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం మహిళలు, రైతులు రోడ్డెక్కిన ఘటన మండలంలోని వల్లూరు పంచాయతీ పరిధి గెద్దాడవారిపాలెంలో చోటుచేసుకుంది. పంట కాలువ, నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ వారు ఆందోళన చేపట్టడంతో దుకాణ లైసెన్స్‌దారుడు కంగుతిన్నారు. ఆ ప్రాంత మహిళలు, రైతులు రైతుసంఘం ఆధ్వర్యంలో వల్లూరు-గుమ్మలూరు ఆర్‌అండ్‌బి రహదారిపై బైఠాయించి మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలని నినదించారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు వల్ల కళాశాలకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులతోపాటు మహిళలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. దీనికితోడు మద్యం దుకాణం పంట కాలువ పక్కనే ఉండటంతో మందుబాబులు తాగేసిన సీసాలను పగలగొట్టి పంట కాలవలో వేయడంతో రైతులు తరచూ గాయాలు పాలవుతున్నారని, రైతులు ఇదేమిటని ప్రశ్నిస్తే మందుబాబులు దౌర్జన్యానికి దిగుతున్నారని అన్నారు. తక్షణమే మద్యం దుకాణం తొలగించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇదే పరిధిలో వైన్‌షాప్ పెట్టారని, మహిళలు, రైతులు ఇబ్బందులకు గురవడంతో ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడంతో అధికారులు దిగొచ్చి అక్కడున్న వైన్‌షాప్‌ను వేరేచోటకు తరలించారని తెలిపారు. అక్కడకు చేరుకున్న ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ మద్యం దుకాణాన్ని అడ్డుకుంటే నేరమని, ఏమైనా సమస్య ఉంటే నేరుగా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తే సమస్య పరిష్కరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణరాజు, ఇందుకూరి శారదాదేవి, నేదురి జానకి, ఉందుర్తి సీతమ్మ, వై.ఉషారాణి, ఉందుర్తి సత్యవతి, ఖండవల్లి నాగమణి, రైతులు రమేష్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ధర్మారావు, నాగరాజు పాల్గొన్నారు.

నరసాపురం ఆర్‌డిఒకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యార్థులు

కళాశాల వద్ద మద్యం దుకాణం వద్దండి
ఎంఎల్‌ఎ, ఆర్‌డిఒలకు విద్యార్థుల వినతి

నరసాపురం:'సార్.. మా కళాశాలకు దగ్గరగా మద్యం షాపు వద్దు' అంటూ విద్యార్థులు నరసాపురం ఎంఎల్ఎ, ఆర్‌డిఒలను కోరారు. బుధవారం స్థానిక శ్రీ సూర్య జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులంతా కలిసి నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసిరాజును కలిశారు. ఒకటో వార్డు శ్రీహరిపేట సమీపంలో తమ కళాశాలకు దగ్గర్లో నూతన మద్యం షాపు ఏర్పాటు చేయొద్దని వినతిపత్రం అందించారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల మందుబాబుల ఆగడాలు ఎక్కువవుతాయని ఆవేదన చెందారు. తమ కళాశాలకు దూరంగా పెట్టుకోవాలి అని కోరారు.

ముత్యాలపల్లిలో మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ముత్యాలపల్లిలో..

మొగల్తూరు:జనావాసాల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని కోరుతూ మహిళలు మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వహించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, మళ్లీ ప్రయివేటు మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే పరిస్థితి మరింత దిగజారుతుందని ఆ ప్రాంతవాసులు ఆందోళన చేపట్టారు. ఆ దుకాణం దక్కించుకున్న వ్యక్తులు అక్కడికి వచ్చి రెండు నెలల్లో వేరేచోటికి మారుస్తామన్నా మహిళలు అంగీకరించలేదు. దీంతో మద్యం దుకాణం ప్రారంభించలేదు. ఈ ఆందోళనలో తిరుమాని కృష్ణవేణి, దొంగ వెంకాయమ్మ, శ్రీలక్ష్మి, వెంకటలక్ష్మి, అంకాని లక్ష్మి, బాలం సంతోషమ్మ, ఇరుసుమండ కనకదుర్గ, కొపనాతి లక్ష్మి, బర్రె మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును అమ్మబోమని కేంద్రం ప్రకటించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం
ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి
జిల్లా కార్యదర్శి బి.బలరాం

మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మబోమని కేంద్రం వెంటనే ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో జిల్లాలోని వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే నడుపుతామని కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. దీనిపై నిర్ణయం చెప్పకుండా తాత్సారం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయలు, వంటనూనె, వంట గ్యాస్, ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రభుత్వం వెంటనే ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. అధికారంలోకి వస్తే ధరలు నియంత్రిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం దీనిపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలు, తుఫానులకు పంట నష్టపోయి రైతాంగం, ఉపాధి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇదే సమయంలో నిత్యావసరాల ధరలు మండిపోవడంతో పూట గడుపుకోవడానికి ప్రజానీకం నానావస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ప్రజా సమస్యలపై, నిత్యావసర వస్తువుల ధరలపై దృష్టి సారించాలని కోరారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఉచిత ఇసుక హామీని నెరవేర్చి కుదేలైన నిర్మాణ రంగాన్ని కాపాడాలని, దానిపై ఆధారపడ్డ వేలాది కార్మికులకు ఉపాధి కల్పించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, కవురు పెద్దిరాజు, పివి.ప్రతాప్ పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి ప్రచారం

మాట్లాడుతున్న బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మరణానంతరం ఖాళీ ఏర్పడిన తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల్లో రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించిన పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి గెలుపు కోరుతూ బుధవారం ప్రచారం జరిగింది. ఈ మేరకు మండలంలోని ఏడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన, యుటిఎఫ్ తదితర సంఘాల ప్రతినిధులతో కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పాఠశాలల ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ షేక్ సాబ్జీ ఆశయాలను కొనసాగిస్తానని, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సాయిరెడ్డి, డిఎన్‌వి.సత్యనారాయణ, బి.రాము, ఎన్.సత్యనారాయణ రాజు, వెంకటేశ్వర్లు, ఎస్.రామకృష్ణ, జి.నాగ శ్రీనివాస్, ఎస్.మురళీకృష్ణ, వి.కళ్యాణ్ పాల్గొన్నారు.

కాళ్ల:ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, విద్యార్థి, నిరుద్యోగుల వాణిని మండలిలో విన్పించడమే లక్ష్యంగా తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజయానికి అందరూ సహకరించాలని యుటిఎఫ్ నేతలు కోరారు. యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యాన బుధవారం మండల పరిధిలోని తొమ్మిది హైస్కూళ్లు, రెండు ప్రయివేటు పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను కలిసి గోపీమూర్తిని గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేస్తున్న కార్యక్రమాలను, అదేవిధంగా అభ్యర్థి గోపీమూర్తి చేసిన పోరాటాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, పి.శ్రీనివాసరాజు, మండల అధ్యక్షులు బిఆర్‌ఎంకె.స్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్రావు, నాయకులు డి.కనకదుర్గ, కె.రవిచంద్రకుమార్, కె.రామ్మూర్తిరాజు, ఎల్.అప్పలాచార్యులు, పిఎస్.విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

ప్రగతి బాటలో పల్లెలు : కలెక్టర్ నాగరాణి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ, కలెక్టర్

ప్రజాశక్తి - అత్తిలి

పల్లెలను ప్రగతిబాటలో నడిపేందుకు ప్రభుత్వం గ్రామాల్లో పెద్దఎత్తున పనులను చేపట్టిందని, ఉపాధి పని దినాలు చూపించడం ద్వారా మరిన్ని నిధులు అభివృద్ధి పనులకు రాబట్టేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులు రూ.కోటీ 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రెయిను, సిమెంట్ రోడ్లకు కలెక్టర్ చదలవాడ నాగరాణి, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, కుటుంబంలో మహిళ పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఆర్థిక పరిస్థితులను బట్టి పిల్లలను, కుటుంబాన్ని వదిలి విదేశాల్లో పని చేయడానికి వెళుతుంటారని, అటువంటి కుటుంబాల్లో తల్లి ఆలనాపాలనా లేక పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతుంటారని అన్నారు. నైపుణ్యం లేని పనిని ప్రజలకు కల్పించి ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుందన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా వచ్చే మెటీరియల్ కాంపోనెంట్ గతంలో 30 శాతం ఉండేదని, ఇప్పుడు 40 శాతానికి పెరిగిందని తెలిపారు. సుమారు రూ.10 లక్షలు విలువైన పని చేస్తే రూ.నాలుగు లక్షలు మెటీరియల్ కాంపోనెంట్ కింద మంజూరవుతుందని, తద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. ఉపాధి హామీ పనుల్లో గ్రామస్తులకు ఉపయోగపడే పనులు, కాలువలు, డ్రెయిన్లు, రైతులకు అనుసంధానమైన పనులు గుర్తించి కేటాయించాలన్నారు. చేసిన పనులు తాత్కాలికంగా కాకుండా నాణ్యంగా ఉండాలని సూచించారు. మానవ మనుగడకు చెత్త పెద్ద సమస్యగా మారిందన్నారు. చెత్తను, బాటిల్స్‌ను డ్రెయిన్లలో, కాలువల్లో వేయడం వంటివి చేయడం వల్ల కాలువలు ప్రవహించే నీరు కలుషితమై ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. చేపట్టిన పనులు నాణ్యంగా ఉండేలా గ్రామ సర్పంచి, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు చేపట్టేందుకు ప్రభుత్వం పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. ఈ పనులన్నింటినీ వచ్చే సంక్రాంతి నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, పంచాయతీరాజ్ డిఇ బి.విజయ్‌కుమార్, తహశీల్దార్ డివి.సుబ్రహ్మణ్యేశ్వరవంశీ, ఎంపిడిఒ పి.శామ్యూల్, గ్రామ సర్పంచి తాతాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ ఉద్యోగుల నేత లక్ష్మణస్వామి చిరస్మరణీయుడు

సంస్మరణ సభలో పలువురు నేతలు

లక్ష్మణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సొసైటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సొసైటీల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఎ.లక్ష్మణస్వామి చిరస్మరణీయుడని, ఆయన అకాల మృతి సంఘానికి తీరని లోటు అని సహకార సంఘాల ఉద్యోగులు యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, కన్వీనర్‌గా పని చేసి ఇటీవల అనారోగ్యంతో మరణించిన లక్ష్మణస్వామి సంస్మరణ సభను బుధవారం తాడేపల్లిగూడెం సొసైటీలో ప్రస్తుత యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.విజయ్‌భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ లక్ష్మణస్వామి సంఘాన్ని ఐక్యతతో నడపడంలో మంచి మెళకువతో పని చేశాడని, ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటాన్ని నిర్వహించారని అన్నారు. సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వివిధ పోరాటాల్లో పాల్గొని చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. లక్ష్మణస్వామి మృతి ఉద్యోగ, కార్మిక సంఘాలకు తీవ్ర నష్టమని ఆయనకు జోహార్లు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి టి.గంగరాజు మాట్లాడుతూ 1990-95 మధ్యకాలంలో జిల్లాలో సహకార సంఘాల ఉద్యోగుల సంఘాన్ని నిర్మించడానికి లక్ష్మణస్వామి చేసిన కృషిని కొనియాడారు. యూనియన్‌ను సిఐటియుకి అనుబంధం చేయడానికి నిరూపమాన కృషి చేశారన్నారు. లక్ష్మణస్వామి చూపిన బాటలో ఉద్యోగులు మరింత ఐక్యతతో సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.సత్యనారాయణ మాట్లాడుతూ హైదరాబాదు, విజయవాడ, ఏలూరుల్లో జరిగిన అనేక ఉద్యమాల్లో ఆయన చూపిన చొరవ, పట్టుదల, సమస్యల పరిష్కారానికి రాజీ లేకుండా చేసిన కృషిని గుర్తు చేశారు. జిఒ 36 అమల కోసం రాబోయే కాలంలో లక్ష్మణస్వామిని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగులంతా ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు. తొలుత లక్ష్మణస్వామి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు, ఉద్యోగుల యూనియన్ నాయకులు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

డెల్టాలో భారీ వర్షం

ప్రజాశక్తి - నరసాపురం

తుపాన్ కారణంగా నరసాపురంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో మెయిన్ రోడ్డు జలమయమైంది. రోడ్లపై డ్రెయినేజీ నీరు పారడంతో ప్రయాణికులు, పాద చారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడ్డారు.

మొగల్తూరు :మండలంలోని పలు గ్రామాలలో బుధవారం ఉరుముల మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పాలకొల్లు: పాలకొల్లులో బుధవారం ఉదయం, సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వివాహ వేడుకల నిర్వాహకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ఎండ, వాన, మబ్బులు దోబూచులాడుతూ చివరకు ఉదయం, సాయంత్రం వర్షం దంచి కొట్టింది.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఏరియా హాస్పిటల్స్, సిహెచ్‌సిల వైద్యులు ప్రత్యేక చొరవ చూపించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఏరియా హాస్పిటల్స్, సిహెచ్‌సిల పనితీరుపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆసుపత్రుల పని వేళల్లో వైద్యులు ఎట్టి పరిస్థితుల్లో ఆస్పత్రులో ఉండాల్సిందేనన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు కచ్చితంగా నమోదు చేయాలని, తదుపరి సమీక్షలో హాజరు నమోదులో లోటుపాట్లను ఉపేక్షించేదని హెచ్చరించారు. కొన్ని వైద్య సేవలకు నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, ఇటువంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌కు పేదలు వస్తుంటారని, వాళ్ల వద్ద నగదు వసూలు అనేది క్షమించరాని నేరం అని అన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు పెరగాలన్నారు. వైద్యులు ఎప్పుడూ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటేనే ప్రజలకు నమ్మకం కలుగుతుందని, తద్వారా ప్రయివేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయించడం ఉండదని స్పష్టం చేసారు. గర్భిణులు ఎనిమియాతో ఎట్టి పరిస్థితుల్లో బాధపడకూడదన్నారు. ఆకివీడు, ఆచంట ఆసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. ఇన్‌పేషెంట్లు, మైనర్ సర్జరీలు ఇంప్రూవ్ చేయాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్‌లను చేయించాలని ఆదేశించారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, డిఎంహెచ్ఒ డాక్టర్ మహేశ్వరరావు, ఎపిఎంఐడిసి డిఇ శ్రీనివాసరెడ్డి, సివిల్ సర్జన్ అండ్ గైనకాలజిస్ట్ డాక్టర్ వి.అరుణ, సిఎస్ ఆర్థో డాక్టర్ ఒంగోలు రవికుమార్, భీమవరం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.మాధవికళ్యాణి, ఆకివీడు సిహెచ్‌సి డాక్టర్ ఎవిఎల్ఎస్.గణేష్‌రావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

తన హయాంలో అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు అన్నారు. మత్స్యపురిలో చేపట్టనున్న పలు సీసీ రోడ్డు పనులను ఎంఎల్ఎ బుధవారం ప్రారంభించారు. రూ.32 లక్షలతో గ్రామంలో పలు రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని, గ్రామ సర్పంచి కారిపెల్లి శాంతిప్రియ, మాజీ సర్పంచి పిప్పళ్ల నాని, వీరవల్లి చంద్రశేఖర్, చింతా కనకయ్య, అధికారులు పాల్గొన్నారు.

సద్గుణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

సద్గుణరావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - కాళ్ల

రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దొండపాటి సద్గుణరావు సేవలు ఎనలేనివని, ఆయన బాటలోనే పయనించాలని రెవరెండ్ జక్కరం ప్యారిస్ గురు మండల అధ్యక్షులు జీడి కరుణాకర్ అన్నారు. బొండాడ చినపేట సెయింట్ పాల్ లూథరన్ చర్చిలో బుధవారం దొండపాటి సద్గుణరావు ఆదరణ కూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ కాపరులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తితో పాటు, సంఘ కాపరిగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సద్గుణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ సిహెచ్.విక్టర్‌బాబు, దొండపాటి ఆరోను సురేష్ కుమార్,రాజ్ కుమార్, రవిచంద్రన్, చిలకపాటి సుందర్రావుతోపాటు పలు గ్రామాల నుంచి సంఘ కాపర్లు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

18న కాళ్లకూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 18న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ దాట్ల వెంకటరామరాజు తెలిపారు. కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ కార్యాలయంలో ఆకివీడు ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి, భీమవరం విష్ణు దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా ఉచిత కంటి, దంత వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. శిబిరంలో కంటి పరీక్ష అనంతరం అవసరమైన వారికి వెంటనే ఉచితంగా కళ్లజోళు అందిస్తామన్నారు. ఆపరేషన్లు కూడా చేయిస్తామన్నారు. ప్రజలందరూ దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు ఉచిత వైద్యం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఎన్‌టిఆర్ వైద్య సేవలందిస్తున్న ఆసుపత్రులు పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎన్‌టిఆర్ వైద్య సేవలకు సంబంధించి డిస్ట్రిక్ డిసిప్లీనరీ సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. కొన్ని హాస్పిటల్స్ యాజమాన్యం పేషెంట్ల నుండి నగదును వసూలు చేస్తున్నారని, వైద్యం అందించడంలో అలసత్వం వహిస్తున్నారని ఫిర్యాదులు అందాయని అన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవలను ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తోందన్నారు. ఎటువంటి నగదును ఆసుపత్రుల యాజమాన్యాలు వసూలు చేయకూడదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయకుండా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖాధికారి డి.మహేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ, ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ కీర్తి, ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ బాలకృష్ణ రాజు, వివిధ హాస్పిటల్స్ డాక్టర్లు పాల్గొన్నారు.

నరసాపురం మున్సిపల్ ఎఇగా నవ్య

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ ఎఇగా నవ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె భీమవరం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఈ స్థానంలో పనిచేసిన మణి భీమవరం బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఎఇ మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎఇ నవ్యను ఇంజినీరింగ్ సిబ్బంది అభినందించారు. డిఇ రమేష్ కూడా విజయవాడ బదిలీ అయ్యారు. ఇంకా ఈ పోస్టులో ప్రవీణ్‌ను నియమించారు. ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు

క్షయపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో సిహెచ్ అగ్రహారంలో యుపి స్కూల్ విద్యార్థులకు బుధవారం క్షయపై కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాలరాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఏడు రోజుల పాటు దగ్గు, కఫం పడడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చాతిలోనెప్పి, నోటినుండి రక్తం చారలు పడటం, సాయిత్రం జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్‌ఎం.రమేష్, చింతలపాటి దుర్గాభవాని, ఎంఎల్‌హెచ్ పి.మాధురి, యేసమ్మ, పద్మ, మంగేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అక్రమంగా మందుగుండు సామగ్రి విక్రయం

ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మందుగుండు సామగ్రిని విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తణుకురూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన బసవా సుధాకర్, బద్దెల అన్నవరం కలిసి తణుకు మండలం దువ్వ హైస్కూల్ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక షాపును అద్దెకు తీసుకున్నారు. ఈ షాపులో మందుగుండు సామగ్రి నిల్వలు ఉంచి రహస్యంగా విక్రయిస్తున్నారు. రూరల్ ఎస్ఐ ఎజిఎస్ మూర్తికి అందిన సమాచారం మేరకు బుధవారం తనిఖీ చేసి సుమారు రూ.2 లక్షల విలువైన మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు మండలం మండపాక గ్రామ సమీపంలో కాలువలో మంగళవారం లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే. అయితే మృతుడు ఇరగవరం మండలం గోటేరు గ్రామానికి చెందిన చంద్రవరపు రాజేష్ (34)గా పోలీసులు గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఎజిఎస్.మూర్తి తెలిపారు.

ఆలయంలో వెండి కిరీటం చోరీ

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరు గ్రామంలో విఘ్నేశ్వర ఆలయంలో వెండి కిరీటం చోరీకి గురైంది. ఆలయంలో వినాయకుని విగ్రహానికి ఉన్న 500 గ్రాముల వెండి కిరీటాన్ని గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయినట్లు గ్రామానికి చెందిన గుణ్ణం హరి వెంకట రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ ఎస్ఐ ఎజిఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సీసీ రోడ్లపై మళ్లీ రోడ్లు వేసేందుకు సిద్ధం

చక్రం తిప్పిన డిఇ స్వామినాయుడు..!

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజాభీష్టం, ఎంఎల్ఎ ఆదేశాలు సైతం పక్కన పెట్టి ఓ ప్రజాప్రతినిధితో ఉన్న తత్సంబంధాలు చెడకుండా ఉండానికి నిబంధనలను సైతం పక్కన పెట్టి సీసీ రోడ్లపైనే సీసీ రోడ్లు వేసేందుకు పంచాయతీ రాజ్ డిఇ గుద్దటి స్వామినాయుడు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదారులను గుర్తించి వాటిని ప్రాధాన్యతా క్రమంలో గ్రామ సభల ద్వారా ప్రజల ఆమోదంతో తీర్మానించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కానీ వీరవాసరంలో అలా జరగలేదు. గతంలో మండల పరిషత్ ద్వారా అప్పటి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఒకే ప్రాంతంలో సీసీ రోడ్లపై సీసీ రోడ్లు వేసేందుకు ప్రతిపాదించిన రహదారులనే పనుల కొనసాగింపు పేరుతో ప్రస్తుత ఎంఎల్ఎ అంజిబాబు ప్రతిపాదించారంటూ గ్రామ సభకు తీసుకురావడం జరిగింది. ఈ విషయం స్థానికులు అంజిబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆ పనులన్నింటినీ రద్దు చేయాలంటూ డిఇ స్వామినాయుడును ఆదేశించారు. సీసీ రోడ్లపై మరలా సీసీ రోడ్లు ప్రతిపాదించిన విషయం తనకు తెలియదని సదరు డిఇ అప్పుడే చెప్పడం జరిగింది. తదనంతరం కొన్ని ప్రాంతాల్లో మట్టి రోడ్లు దుస్థితిపై గ్రామస్తులు ఎంఎల్ఎ అంజిబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. గ్రామ సభలో ప్రతిపాదించిన అవసరంలేని రోడ్లను కొన్నింటిని రద్దు చేసి వాటి స్థానంలో మట్టి రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ డిఇని ఆదేశించినట్టు సమాచారం. అయితే అటు ఎంఎల్ఎ అదేశాలు గాని, మట్టి రోడ్ల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గాని పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోలేదు. ముందుగా డిఇ నిర్ణయించుకున్నట్టుగానే సీసీ రోడ్లపై మరోసారి సీసీ రోడ్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఎంఎల్ఎ ఆదేశాలను సైతం పక్కనపెట్టి సీసీ రోడ్ల పైనే మరోసారి సీసీ రోడ్లు వేసేందుకు డిఇ ప్రాధాన్యత ఇవ్వడంపై డిఇని ప్రభావితం చేసిన సదరు ప్రజాప్రతినిధి ఎవరా అనే ప్రశ్న గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతోంది. సదరు ప్రజాప్రతినిధి కోసం డిఇ అంత ఆరాటపడడం ఎందుకనే చర్చ నడుస్తోంది. సీసీ రోడ్లపై రోడ్లు వేస్తున్న అధికారుల చర్యల తీరుపై పత్రికల్లో కథనాలు ప్రచురించినా తమను ఉన్నతాధికారులు గానీ, ఎంఎల్ఎ గానీ ఏమి అనలేదని ఓ కిందిస్థాయి అధికారి వాఖ్యానించడం గమనార్హం. ఉన్నతాధికారులు సైతం తమ చేతిలో కీలు బొమ్మలు అనే సంకేతం ఒక కిందిస్థాయి అధికారి వాఖ్యానాలు ద్వారా తెలుస్తోంది. సీసీ రోడ్లపై సీసీ రోడ్లు వేయడం కుదరదని అప్పట్లో గ్రంధి శ్రీనివాస్‌కు చెప్పడం జరిగిందని, ఆయన ఒత్తిడితోనే ఆ రోడ్లను ప్రతిప్రాదించడం జరిగిందని అదే అధికారి చెప్పడం కొసమెరుపు. జరిగిన పరిణామాలపై పంచాయతీ అధికారులను వివరణ అడగ్గా డిఇ అభీష్టానం మేరకే పనుల ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పగా గ్రామ పంచాయతీ అధికారులు ప్రతిపాదనల మేరకు అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటామని ఇంజినీరింగ్ శాఖ జిల్లా అధికారి చెప్పడం పట్ల అధికారుల తీరుకు అద్దం పడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 20న భీమవరం ఎంఎల్ఎ అంజిబాబు సీసీ రోడ్లపై సీసీ రోడ్ల పనులు ప్రారంభించబోతున్నారు.

వీరవాసరంలో సీసీ రోడ్డుపై సీసీ రోడ్డు వేయనున్న ప్రాంతం

నిరసన తెలుపుతున్న గ్యాస్ కార్మికులు

గ్యాస్ కార్మికులకు చట్టప్రకారం వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - తణుకు

గ్యాస్ కార్మికులకు చట్టప్రకారం వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనంలో టి.ఈశ్వరరావు అధ్యక్షతన సభ జరిగింది. తొలుత సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్), ఇతర అమరులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గ్యాస్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికశాఖ అధికారులు ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న వారి పరిస్థితులను నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులూ లేవన్నారు. పెరుగుతున్న ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గార రంగారావు, పిడి మూర్తి, ముత్యాలరావు, పద్మరావు, శ్రీను, సోమయ్య, దుర్గారావు, సుగుణరావు, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

గోస్తనీ కాలువలో పూడికతీయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో ప్రధానమైన గోస్తనీ నది మురుగు కాలువలో పూడిక తీసి, ఖరీఫ్‌లో వరి పంటను కాపాడాలని పలువురు రైతులు అధికారులను కోరారు. బుధవారం మండలంలోని సోమరాజు ఇల్లందులపర్రు, జుత్తిగ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎ.జ్యోషిలా మాట్లాడుతూ ఖరీఫ్‌లో యాజమాన్యం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ముఖ్యంగా గోస్తనీ నది మురుగు కాలువ పరిసర ప్రాంతాల్లో సాగు చేస్తున్న వరి రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. గోస్తనీనది పూర్తిగా పూడుకపోయిందని తెలిపారు. వెంటనే తవ్వకం మొదలు పెట్టాలని, దానిద్వారా సార్వాలో వరి పంట ముంపునకు గురికాదని తెలిపారు. ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు నాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఎపి నిట్‌లో టెక్రియా 2కె24

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్)లో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజులపాటు టెక్రియా 2కె24 కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం రాత్రి ప్రాంగణంలోని గ్రంథాలయం వద్ద కర్టెన్‌రైజర్ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సమాజహిత పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు తలారి రేష్మా తదితరులు పాల్గొన్నారు.

టెక్రియా కార్యక్రమాలు

ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు ప్రాంగణంలోని గ్రంథాలయం వద్ద బైక్ స్టంట్ షో, 18, 19 తేదీల్లో ఇస్రో ఎగ్జిబిషన్, టెక్నికల్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. రాత్రి ఆరు గంటల నుంచి విద్యార్థులు రేలంగి వెంకట్రామయ్య ఓపెన్ ఆడిటోరియం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్ఎన్.మూర్తి తెలిపారు.

మద్యం దుకాణాలు కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతనంగా ఏర్పాటు అయిన మద్యం దుకాణాలు కొనుగోలుదారులతో బుధవారం కిటకిటలాడాయి. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా దుకాణాల వద్ద బారులు తీరారు. పలువురు గొడుగులు వేసుకుని మద్యం దుకాణానికి తరలివచ్చారు. మొగల్తూరులోని కావగట్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద కొనుగోలుదారులు బారులు తీరారు.

50 మీటర్లు ముందుకొచ్చిన సముద్రం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో సముద్రం బుధవారం పోటెత్తింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్రంలోని అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. సుమారు 50 మీటర్లు సముద్రం ముందుకు వచ్చింది.

తక్కువ ధరకు నాణ్యమైన మద్యం

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రణతి వైన్స్ మద్యం దుకాణాన్ని బుధవారం సాయంత్రం టిడిపి సీనియర్ నాయకులు ముదుండి సురేంద్ర వర్మ (ఎంఎస్) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దుచేసి ప్రయివేటు యాజమాన్యాలకు అప్పగించిందని తెలిపారు. దీనిద్వారా ప్రభుత్వానికి ఆదాయమే కాకుండా ప్రజలకు నాణ్యమైన మద్యం దొరుకుతుందని అన్నారు. ప్రయివేటు మద్యం దుకాణాల వారు ప్రభుత్వం కేటాయించిన సమయాల్లో నాణ్యమైన మందు సరఫరా చేయాలని కోరారు.

పల్లె పండుగతో గ్రామాలాభివృద్ధి

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ వారోత్సవాలు చేపట్టారని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని మెట్ట ఉప్పర గగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇటుకలగుంట గ్రామంలో బుధవారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల్లో వైసిపి ప్రభుత్వం ఏ గ్రామంలోనూ కనీసం రోడ్డు నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్లపై దృష్టి సారించిందన్నారు. ఇటుకలగుంట నుంచి ఆరుగొలను వరకూ రహదారి నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలు మంజూరయ్యాయన్నారు. దమ్ము చక్రాలు, వరి కోత యంత్రాలతో రోడ్లు పాడవకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. తొలుత ఇటుకలగుంట నుంచి ఆరుగొలను రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లాది విశ్వనాథ్, ఇఒపిఆర్‌డి ముప్పిడి వెంకటేష్, గ్రామ సర్పంచి మర్లపాటి వీర వెంకట సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. చినమల్లం గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.50 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రహదారులు, మురుగు డ్రెయిన్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.40 లక్షలతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల గోడౌన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో ఆచంట జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, గ్రామ సర్పంచి చిట్టూరి సుబ్రహ్మణ్యం, టిడిపి మండల అధ్యక్షుడు వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గణపవరం : గ్రామాలాభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొత్త పనులకు నాంది పలికారని ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక పంచాయతీ వద్ద నిర్వహించిన పల్లె పండుగలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సభకు గ్రామ సర్పంచి మూర అలంకారం అధ్యక్షత వహించారు. సభలో ధర్మరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీ వ్యవస్థలో పవన్ కళ్యాణ్ సరికొత్త మార్పులు తీసుకొచ్చారన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మి, తహశీల్దార్ ఎ.అప్పారావు, ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

18 నుంచి రీసర్వే గ్రామసభలు

తహశీల్దార్ భారతి విజయలక్ష్మి

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలో రిసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకూ రీసర్వే గ్రామ సభలు నిర్వహించనునట్లు తహశీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన రీ సర్వేలో సమస్యలను పరిష్కరించేందుకు సర్వే గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు సదస్సుల దష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కొండేపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి ఐదు గంటల వరకూ వేంద్ర అగ్రహారంలో నిర్వహించునున్నట్లు తెలిపారు. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు గొరగనమూడిలో, 22న పెన్నాడ అగ్రహారంలో, 23న విస్సాకోడేరులో, 24న వేంద్రలో, 25న గరగపర్రులో, 26న గొల్లలకోడేరులో, 29న ఉదయం కోరుకొల్లులో, మధ్యాహ్నం కోరుకొల్లు, మైప గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 30న మోగల్లు, నవంబర్ 2న పాలకోడేరు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసరాల సరుకులు అందించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలం వెంపలోని పెద్దపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధరలను నియంత్రించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి లేక ఆదాయం లేక ప్రజలు అలమటిస్తుంటే ధరలు ఆకాశాన్నంటడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైందన్నారు. కేరళ రాష్ట్రం వల్లే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంద యాకోబు, వర్ధనపు కన్నమ్మ దాసు, వర్ధనపు పండు, భూపతి స్యామేలు, మంద కుటుంబరావు, మంద రాజు, బొబ్బనపల్లి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నేతలు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

తణుకు రూరల్ : గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పల్లెలకు పండుగ తీసుకొచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం కొమరవరంలో నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అధికారులతో వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టేందుకు ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వాటికి సత్వర పరిష్కారాలు చూపించేందుకు, ఆర్థికపరమైన ఇబ్బందులు తొలగించేలా ప్రణాళికలు రూపొందించడంలో, ప్రజల సంక్షేమ పథకాలు అమలు తీరు వంటి అనేక అంశాలను గమనించేందుకు 'గ్రామ దర్శని' దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొమరవరం సర్పంచి కడిబండి రాజేష్, ఎంపిడిఒ ఆర్.లోహిత్‌సాగర్, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

18న ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 18న విజయవాడలో జరగనున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి దాన వరప్రసాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాల రాసిందన్నారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసినప్పటికీ, మూడు క్రిమినల్ చట్టాలను జులై 1 నుంచి అమల్లోకి తెచ్చిందన్నారు. 4 లేబర్ కోడ్‌లు, మూడు క్రిమినల్ కోడ్‌లను రద్దు చేయాలని, పారిశ్రామిక ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 18న విజయవాడలో జరగనున్న రాష్ట్ర సదస్సును కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రసాద్ కుమార్, వెంకటేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

ఆకివీడు : ఈ నెల 18న విజయవాడలో జరిగే ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ పిలుపునిచ్చారు. స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి తోట రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. రామ్మోహన్ మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వ, ప్రయివేటురంగాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, రోజువారి కార్మికులుగా ఎందరో పనిచేస్తున్నారన్నారు. సదస్సును కార్మిక లోకం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సదస్సు ప్రచార కరపత్రాలను, వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టియు నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లు తెరిపించాలి

ప్రజాశక్తి - పోడూరు

ఇసుక రీచ్‌లు తెరిపించి భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలని సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడూరు శాఖా మహాసభ కాకర వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సభలో మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ పోడూరులో జగనన్న కాలనీలకు రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలన్నారు. కొత్తపేట నుంచి గరువు వరకూ విద్యుత్ స్తంభాలు, లైట్లు వేయాలని, ప్రతి ఇంటికీ రక్షిత నీరు సరఫరా చేయాలని మహాసభలో తీర్మానం చేశారు. అనంతరం శాఖా కార్యదర్శిగా కాకర వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ సభలో బొంతు శ్రీను, బూరాబత్తుల వెంకట్రావు, చల్లబోయిన శ్రీను, బొంతు శంకర్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, కొవ్వలి గ్రామ కాపురస్తులు నా క్లయింటు అయిన చంపాటి నరశింహరాజు గారి కుమారుడు చంపాటి రామరాజు గార్కి గల **8328/2014 మరియు 1230/2009** అను ఈ రెండు దస్తావేజులు ది.12-11-2024వ తేదీన కొవ్వలి నుండి ఏలూరు వెళుతుండగా దస్తావేజులు కలిగిన కవర్ సత్రంపాడు మార్గంమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఎ.మణికుమార్
అడ్వకేట్, వట్లూరు, ఏలూరు
సెల్: 94416 40035

దస్తావేజులు పోయినవి

మా క్లయింటు పులవర్తి దేవానంద్, తండ్రి: భుజంగరావు, దుగ్గిరాల, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా కాపురస్తులు సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా.., ఏలూరు ఎస్.ఆర్.ఓ.కు చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం.2255/2001, తేదీ.23-03-2001 గల దఖలు దస్తావేజులో ఆర్.ఎస్.నెం. 428, దుగ్గిరాలలో జేరియున్న 108.8/9 చ॥గ॥ల యొక్క స్థలము అందలి ఆర్.సి.సి. డాబా ఇంటి యొక్క దస్తావేజులు బ్యాంకు లోను నిమిత్తంగా జిరాక్సు తీసుకొనుటకు ఇంటి నుండి వెళ్ళు చుండగా ది.13-10-2024న మార్గమధ్యమున కొత్త బస్టాండు సమీపంలో పోగొట్టుకొని యున్నారు. సదరు దస్తావేజు ఎవరికైననూ దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

మారిశెట్టి సుశీల
అడ్వకేట్, తూర్పు వీధి, ఏలూరు.
సెల్: 85209 78581

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
యస్.ఓ.పి.నెం. 2/2024

Between:
Pothuri Srinivasa Raju, S/o. Venkata Rama Raju, Resident of 1-1-365/B/1/309, Siddamsetti Towers, Near R.T.C. X Roads, Jawahar nagar, Hyderabad-500020. Hyderabad City Civil Courts. ***...Petitioner***
AND
Pothuri Butchi Raju, S/o. Venkata Rama Raju, R/o. Plot No.92, Kalyan Nagar, Phase-3, Opp. Bhargavi Hospital, Motinagar, Hyderabad-500020. ***...Respondent***

పై నెంబరు పిటీషనరు, స్వర్గీయ పొత్తూరి వెంకట రామరాజు మరియు స్వర్గీయ పొత్తూరి అన్నపూర్ణమ్మ గారల వారసులలో తనను ఒక వారసుడిగా ప్రకటించి వారి పేరున ది.కరూర్ వైశ్య బ్యాంకు లిమిటెడ్, పాలకొల్లు, ది.కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ పాలకొల్లు మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏనుగువానిలంక, నరసాపురం మండలంలో గల పైన తెలిపిన వారి సొమ్ములలో (పై పిటీషను షెడ్యూలలలో చూపించిన) తనకు సగము వాటా కలదని సక్సేషన్ సర్టిఫికెట్ జారీ చేయవలసినదిగా కోరుచూ పై నెంబరు పిటీషను దాఖలు చేసినందున ఎవరికైనా, ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది.04-11-2024వ తేదీ ఉదయం గం॥10:00 ని॥ల పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై తమ అభ్యంతరములు తెలియచేసుకొనవలెను.**

MAJJI VVS VARA PRASAD
Narsapuram, 16-10-24.
Advocate, Palakol
Cell: 9393222736

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు
ఓ.ఎస్.నెం. 116/2020

బిట్వీన్:
1) శ్రీమతి దున్న విజయ లక్ష్మి @ జయమ్మ
2) దున్న నరసిహ స్వామి
3) సరిల్లా ధనలక్ష్మి ***...వాదులు***
AND
1) వెన్నపు పెద్ద అబ్బాయి @ పెద్ద అబ్బులు
2) శ్రీమతి వెన్నపు కుమారి
3) వెన్నపు నాగరాజు
4) వెన్నపు రమేష్
5) వెన్నపు గంగాధర్ ***...ప్రతివాదులు***

4వ మరియు 5వ ప్రతివాదులు:
4వ ప్రతివాది: వెన్నపు రమేష్, తండ్రి: లేటు సుబ్బారావు, వెన్నపు వారి పాలెం (ఆచంట శివారు), ఆచంట మండలం.
5వ ప్రతివాది: వెన్నపు గంగాధర్, తండ్రి: లేటు సుబ్బారావు, వెన్నపు వారి పాలెం (ఆచంట శివారు), ఆచంట మండలం.

దావా సమను

వాదులు దావా షెడ్యూలు ఆస్థి అయిన ఆచంట గ్రామంలో రి.స.నెం.932/4రులో య.0-40 సెంట్లులో ఉత్తరం వైపు య.0-20 సెంట్లు భూమి ఆస్థి శ్రీమతి వెన్నపు చంద్రమ్మ గారు ది.24-05-2010 సం॥రం తేదీన వాదులకు సెటిల్మెంట్ దస్తావేజు నెం.875/2010 రుగా దఖలు పర్చిన రీత్యా వాదులకు సంక్రమించిన ఆస్థి వారికి Vacant Possession గా అప్పగించవలెనని మరియు Past Profits వగైరాల పరిహారములతో పై దావా వేసియున్నారు. మరియు సదరు దావాలో I.A.No.617/2020 (Or 40 Rl 1) పిటీషను కూడా వేసియున్నారు. సదరు దావా ది.24-10-2024 సం॥రం తేదీకి పై కోర్టు వారు వాయిదా వేసియున్నారు. సదరు దావాలో 4వ మరియు 5వ ప్రతివాదులు, పిటీషనులో 4వ, 5వ రెస్పాండెంట్సు అయ్యిన మీరు **ది.24-10-2024 సం॥రం తేదీన మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ వాదన తెలియపర్చనిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియచేయడమైనది.**

కంచెర్ల సురేష్ బాబు
పాలకొల్లు, 16-10-24.
వాదుల తరపు అడ్వకేట్
సెల్: 9440111308